అభివృద్ధికి నిధులు కేటాయించండి

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గం పరిధిలోని పరిశ్రమల నుంచి కేటాయించిన సీఎస్‌ఆర్ నిధులను స్థానిక గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కేటాయించాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. గురువారం ఆమెను కలిసి పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని జిన్నారం, గుమ్మడిదల, పటాన్‌చెరు మండలాల పరిధిలో వందలాది పరిశ్రమలు తమ లాభాల్లో కొంతభాగాన్ని కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్‌ఆర్)కు కేటాయించి, అభివృద్ధి పనులకు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ నిధులను జిల్లాలోని ఇతర ప్రాంతాలకు కేటాయించడం వల్ల.. పరిశ్రమలకు భూములు ఇచ్చి, కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న స్థానికులు అభివృద్ధికి దూరం అవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో.. పరిశ్రమలు నెలకొల్పిన గ్రామాల పరిధిలోనే సీఎస్‌ఆర్ నిధులు ఖర్చు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టి బిల్లులు రాక మాజీ ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నూతన పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోందని తెలిపారు. పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.




కలెక్టర్ క్రాంతికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

భెల్ యాజమాన్యం సహకరించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అభివృద్ధి విషయంలో భెల్ యాజమాన్యం సహకరించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. గురువారం పలు సమస్యలను పరిష్కారించాలని కోరుతూ భెల్ ఈడీ కే.బీ.రాజాతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలోని సమస్యలు పరిష్కారంలో బెల్ ఎస్టేట్ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని ఈడీ దృష్టికి తెచ్చామన్నారు. ప్రధానంగా కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులకు సహకరించాలని కోరినట్లు తెలిపారు. అదే విధంగా పలుచోట్ల రోడ్లను మూసివేశారని తెలిపారు. ఎస్టేట్ అధికారుల అభ్యంతరాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వీటిపై భెల్ యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్ లచ్చిరాం నాయక్, బాలాజీ, సరిత, పాపని, నాయకులు మల్లారెడ్డి, రవీందర్‌లు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

● కొల్లం ఎంపీ ఎన్.కె.ప్రేమచంద్రన్



పటాన్ చెరు: జాతి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని, రాజకీయాలను యువత సీరియస్‌గా తీసుకోవాలని కొల్లం లోక్‌సభ సభ్యుడు, రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి ఎన్.కె. ప్రేమచంద్రన్ పిలుపునిచ్చారు. చేంజ్–మేకర్స్ పేరిట గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో గురువారం ఆయన అతిథిగా పాల్గొన్నారు. పరివర్తన కార్యక్రమాలపై దృష్టి సారించి, నాయకత్వం, భారతదేశ భవిష్యత్తుపై తనకున్న లోతైన అవగాహనను విద్యార్థులతో పంచుకున్నారు. వార్డు సభ్యుడి స్థాయి నుంచి, ఎమ్మెల్యే, మంత్రిగా, ఐదుసార్లు ఎంపీగా తన మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని ప్రతిబింబిస్తూ, ప్రేమచంద్రన్ తన విజయానికి కృషి, అంకితభావమే కారణమన్నా రు. కార్యక్రమాన్ని ప్రొఫెసర్ డీఆర్‌పీ. చంద్రశేఖర్, గీతం అధ్యక్షుడు శ్రీభరత్ , అదనపు ఉపకులపతి ప్రొ. డీఎస్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవాలి

● ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



బ్యాగులు పంపిణీ చేస్తున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రభుత్వ బడుల్లో పేదల పిల్లలు చదువుతుంటారు. కావున వారికి స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డి అన్నారు. ఖేడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోసం సేవోద్ధం ఫౌండేషన్ ప్రతినిధులు జయశ్రీ, చంద్రశేఖర్, కార్తీక్ బ్యాగులను గురువారం ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఖేడ్‌లో రూ.125 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులం మంజూరయిందన్నారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, బంజారాసేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, ప్రధానోపాధ్యాయులు మన్మథకిషోర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకట్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి

● ట్రాఫిక్ సీఐ లాలూనాయక్

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నామని ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని నవపాన్ సమీపంలో, ముత్తంగి ఓఆర్‌ఆర్, లక్డారం జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా లాలునాయక్ మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ సూచనల మేరకు, రోడ్డు కాంట్రాక్ట్ వర్కర్ల సహకారంతో గుంతలకు ప్యాచ్ వర్క్ చేశామన్నారు. అలాగే, జాతీయ రహదారిపై మట్టిని తొలగించామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



ప్యాచ్ వర్క్ చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న నాయకులు

మునిపల్లి(అందోల్): వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఎంపీపీ సమావేశ మందిరంలో ఎంపీడీఓ హరినందన్‌రావు, కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొని మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాయికోడ్(అందోల్): రాయికోడ్, పీపడ్‌పల్లి, మహమ్మదాపూర్ ఇటికేపల్లి, కుసునూర్, తదితర గ్రామాల్లో ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఆదికవి రచనాలను స్మరించుకున్నారు. వాల్మీకి జీవితం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మురుగునీరు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

రామచంద్రాపురం (పటాన్‌చెరు): శేరిలింగంపల్లి నుంచి తెల్లాపూర్‌కు వచ్చేమార్గంలోని తెల్లాపూర్ ముఖ ద్వారం వద్ద రోడ్డుపై నిలిచిన మురుగునీటి సమస్యపై ఈనెల 16న సాక్షి దినపత్రికలో 'రోడ్డుపై మురుగు..పట్టించుకోరా..? అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఉదయం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని జేసీబీతో మళ్లించి సమస్యను పరిష్కరించారు. శేరిలింగంపల్లి పరిధిలోని నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ వచ్చే మార్గంలో ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు వేసిన సమయంలో నాలాను అసంపూర్తిగా నిర్మించినందున మురుగునీరు రోడ్డుపై నిలుస్తుందని కమిషనర్ సంగారెడ్డి తెలిపారు.



సమస్యను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

సుహాసినిరెడ్డికి సన్మానం



సుహాసినిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): మెదక్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి నియమితులైన సందర్భంగా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో గురువారం పీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎంఏ హకీమ్ తన కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, రాష్ట్ర నాయకులు రవీందర్‌రెడ్డి, మెదక్ జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సిన్ తప్పనిసరి

● మండల పశువైద్యాధికారి శైలేంద్ర జైస్వాల్

పటాన్ చెరు టౌన్: గాలికుంటు వ్యాక్సిన్‌ను పశువులకు వేయించాలని మండల పశు వైద్యాధికారి శైలేంద్ర జైస్వాల్ తెలిపారు. గురువారం మండలంలోని చిన్న కంజర్ల గ్రామంలో వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శైలేంద్ర జైస్వాల్ మాట్లాడుతూ... పశుపోషకులు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయించాలన్నారు. చిన్నకందల గ్రామంలో 586 బర్రెలకు వ్యాక్సినేషన్ వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సర్ధార్, చంద్రశేఖర్, చక్రవర్తి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న శైలేంద్ర జైస్వాల్

రవాణాశాఖ సేవలు ప్రారంభం

నారాయణఖేడ్: రవాణాశాఖకు సంబంధించిన పలు సేవలు ఖేడ్‌లో గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. పలు వాహనాలు ఫిట్‌నెస్ కోసం రాగా ధ్రువపత్రాలు, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎంవీఐ వెంకటయ్య నిబంధల మేరకు ఫిట్‌నెస్ జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. ప్రతీ గురువారం ఇక్కడ ఫిటెనెస్, డ్రైవింగ్ టెస్ట్, కొత్త ఆటోరిక్షాల రిజిస్ట్రేషన్, లర్నింగ్ లైసెన్సుల జారీ సేవలు ఇక్కడ అందిస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్సులు, వాటి రెన్యువల్ కోసం మీసేవలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని సూచించారు. రానున్న రోజుల్లో అన్ని రకాల సేవలను ఇక్కడే అందించే అవకాశం ఉందని తెలిపారు.



వాహనాన్ని పరిశీలిస్తున్న ఎంవీఐ వెంకటయ్య

ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు ప్రారంభం

జోగిపేట(అందోల్): జోగిపేట నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఓపెన్ డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.రమేశ్ కోఆర్డినేటర్ డాక్టర్ జి పండరి పేర్కొన్నారు. ఈ నెల 30 లోగా చేరాలని కోరారు. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ అర్హతతో అడ్మిషన్ పొందవచ్చునని పేర్కొన్నారు. అడ్మిషన్ కోసం ఎస్ఎస్‌సీ (ఒరిజినల్ మెమో) ఇంటర్, ఐటీఐ, డిప్లొమా ఒరిజినల్, కులం, జిరాక్స్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను, ఒకఫొటో అందజేయాలని కోరారు. 7382929780, 9494875790 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం



శాంసన్ (ఫైల్)

జహీరాబాద్ టౌన్: మండలంలోని చిరాగ్ పల్లికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. చిరాగ్‌పల్లికి చెందిన శిరోమణి కుమారుడు హొక్కరేణి శాంసన్(30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆరోగ్యం బాగు లేదని ఆస్పత్రికి వెళ్తునానని చెప్పి ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చేపల మృతి



చెరువులో మృతి చెందిన చేపలు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం బోరుపట్ల పెద్ద చెరువులో చేపలు గురువారం మృతి చెందినట్లు మత్స్యకారులు తెలిపారు. గ్రామ మత్స్యకారులకు జీవనాధారమైన చేపలు మృతి చెందడంపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చందాపూర్, బోరుపట్ల గ్రామ శివారులోని పరిశ్రమల కాలుష్య జలాలు చెరువు నీటిలో కలవడంతోనే చేపలు మృతి చెందినట్లు వారు ఆరోపిస్తున్నారు. పీసీబీ అధికారులు స్పందించి విచారణ చేసి పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై సంగారెడ్డి పీసీబీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గణపతి సచ్చిదానంద స్వామి సన్నిధిలో స్పీకర్



సచ్చిదానంద స్వామితో స్పీకర్ ప్రసాద్‌కుమార్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలోని గురుదత్త ఆశ్రమంలో గురువారం రాత్రి గణపతి సచ్చిదానంద స్వామిని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దర్శించుకున్నారు. మొదట శ్రీసిద్ధి పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సంగారెడ్డి ఆర్డీఓ రాజు, తహసీల్దార్ సంగ్రామ్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం శ్రీగణపతి సచ్చిదానంద స్వామివారిని కలసి ఆశీర్వాదం తీసుకున్నారు.

మంత్రి దామోదరపై ఫిర్యాదు

జోగిపేట (అందోల్) : ఇటీవల గాంధీ ఆస్పత్రిలో ఓ జర్నలిస్ట్ మందుల కొరతపై మంత్రి దామోదర రాజనర్సింహను ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తించారని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మండిపడ్డారు. మంత్రిగా ఉండి మావాళ్లు , మీవాళ్లంటూ సమాధానం ఇవ్వడం సరికాదన్నారు. దీంతో క్రాంతి కిరణ్ గురువారం సాయంత్రం జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పాండుకు ఫిర్యాదు చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు నాగభూషణం, శ్రీధర్, గోపాల్, కృష్ణ గౌడ్, నాగరత్నం గౌడ్, నర్సింలు, సత్యం, శంకర్ ఉన్నారు.



ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

మంత్రి, ఎంపీ ప్రత్యేక పూజలు

నారాయణఖేడ్: పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ కర్ణాటకలోని గానుగాపూర్ దత్తాత్రేయుడిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో నిర్వహించి హోమంలో మంత్రి, ఎంపీలు సతీసమేతంగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



హోమంలో పాల్గొన్న మంత్రి, ఎంపీ దంపతులు

క్లుప్తంగా

వ్యక్తిత్వ వికాసంతో జీవితంలో వెలుగు



ప్రమాణస్వీకారం చేస్తున్న క్లబ్ బాధ్యులు

నారాయణఖేడ్: వ్యక్తిత్వ వికాసం జీవితంలో వెలుగులు నింపుతోందని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమారెడ్డి అన్నారు. ఇంపాక్ట్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ (ఐసీఐ)ఖేడ్ శాఖ ఇన్‌స్టాలేషన్ ప్రోగాం గురువారం ఖేడ్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ లక్ష్యాలు ప్రతీ ఒక్కరిని మంచిమార్గంలో నడిపిస్తాయన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన ఐసీఐ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు సుధీర్‌బంధం రావూరి, ఖేడ్ ప్రాంత ఇన్‌చార్జి సంతోష్‌కుమార్, అధ్యక్షులుగా నియమితులైన శ్వేత, అంజలి, లావణ్య, నర్సింహారెడ్డి, భాస్కర్, జ్యోతిర్లింగం ,ఆంజనేయులు, చంద్రకాంత్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఐసీఐ రీజినల్ డైరెక్టర్ రాంకమల్, రీజినల్ లీడర్‌షిప్ కె.వి.సురేష్ కుమార్, సంధ్యారాణి పాల్గొన్నారు.

పుల్‌కల్‌లో బీజేపీ సభ్యత్వం

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ మండలంలో బీజేపీ సభ్యత్వం నమోదు చేయిస్తున్నామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పండరి పేర్కొన్నారు. సభ్యత్వం తీసుకోవడానికి మహిళలు, యువకులు ఉత్సాహం చూపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాములు, రాజశేఖర్ రెడ్డి, రమేష్, నర్సింలు, శివ పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



ధాన్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సుధాకర్ రెడ్డి

మునిపల్లి(అందోల్): రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెద్దచల్మెడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సోయాబీన్ ధాన్య కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ దుర్గయ్య ఆధ్వర్యంలో ప్రారంభించారు. అలాగే, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మ సహకారంతో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మశ్చందర్

నారాయణఖేడ్: కల్హేర్ మండలం మార్డికి చెందిన కాశీరాం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎం సహాయ నిధి ద్వారా రూ.60 వేల చెక్కు మంజూరయింది. ఆ చెక్కును గురువారం ఎన్‌ఆర్ఐ, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చందర్ కాశీరాం కుటుంబీకులకు అందజేశారు.

సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై గురువారం కార్పొరేటర్ పుష్ప జీహెచ్ఎంసీ వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలు కాలనీల్లోని సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన నిధులు, పూర్తికాని అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాలవీహార్ పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. జ్యోతినగర్ కాలనీలో నిర్మిస్తున్న బాక్స్‌డ్రైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. మయూరినగర్‌కాలనీలో సీసీ రోడ్డు పనులను త్వరలో ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీసీ సురేష్, ఇరిగేషన్ డీఈ నళిని, ఇంజనీరింగ్ విభాగం డీఈ నరేందర్, ఏఈ పాల్గొన్నారు.

ఆహార భద్రతే లక్ష్యం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో గురువారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్ మాట్లాడుతూ..ఈ భూమిపై జీవించే ప్రతిజీవ రాశికి ఆహారం అనేది ప్రధానమైనదన్నారు. ముఖ్యంగా మానవుడు ఆహారం లేకుండా తన జీవనాన్ని గడపడం సాధ్యం కాదని చెప్పారు. భవిష్యత్తులో ప్రపంచదేశాలకు ఏదైనా ఆపద వస్తుంది అంటే అది ఆహార సమస్యే అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు, జీవశాస్త్ర విభాగం అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఖేడ్‌కు 187మంది ఉపాధ్యాయులు**

నారాయణఖేడ్: నియోజకవర్గానికి ప్రభుత్వం 187 మంది నూతన ఉపాధ్యాయులను కేటాయించింది. ఖేడ్ నియోజకవర్గం మారుమూల ప్రాంతంగా ఉండడంతో అనేక పాఠశాలల్లో ఖాళీలు ఉన్నాయి. నూతన ఉపాధ్యాయులు 8మండలాలకు కలిపి 187 మంది వచ్చారు. అందరూ విధుల్లో చేరారు.

◆ **ఎనిమిది మందికి జరిమానా, జైలు**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిన ఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 8 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. గురువారం వారిని సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, ముగ్గురికి రూ.2 వేలు జరిమానా, మరో ముగ్గురికి రెండు రోజుల జైలు, మరో వ్యక్తికి మూడు రోజులు, మరో వ్యక్తికి ఒకరోజు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

◆ **ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన**

జహీరాబాద్: మండలంలోని చిరాగ్‌పల్లి గ్రామంలో నిర్వహిస్తున్న పరశురామ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.గిరిధర్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డిలు పాల్గొన్నారు. గురువారం నిర్వహించిన తుల్జాభవాని మాత పూజా కార్యక్రమాల్లో పాల్గొని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

◆ **ఉపాధి హామీ పనులపై సమీక్ష**

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకం పనులపై గురువారం సిర్గాపూర్ మండల పరిషత్తులో ఎంపీడీఓ ఎల్.మల్సూర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కొత్తగా నర్సరీలు ఏర్పాటు చేయాలని పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం చేపట్టాల్సిన పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మం, బస్వరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **మీసేవ ఫెడరేషన్ కార్యవర్గ సభ్యుడిగా ఫయాజ్**

జహీరాబాద్ టౌన్ : తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జహీరాబాద్‌కు చెందిన ఫయాజ్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో తనను ఎన్నుకున్న మీసేవ మిత్రులకు ఫయాజ్ కృతజ్ఞతలు తెలిపారు. మీసేవ సమస్యలపై రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్తానన్నారు.

◆ **శిథిల భవనాల పరిశీలన**

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ 4, 15వ వార్డు కౌన్సిలర్లు నిహారిక, సంతోష పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాలకు తడిసి శిథిలావస్థకు చేరిన ఇళ్లను పరిశీలించారు. శిథిలమైన ఇళ్లలో నివసించే ప్రజలను వెంటనే మరో చోటికి తరలించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శిథిల ఇళ్లను గుర్తించి, చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక నాయకుడు వరప్రసాద్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది దినేష్, నవీన్, స్థానికులు సతీష్, భాస్కర్, రాజేష్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **చెరువులా సర్వీస్ రోడ్డు**

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కాజిపల్లి, బొల్లారం మున్సిపాలిటీ శివారులోని ఔటర్ సర్వీస్ రోడ్డు జలమయంగా మారింది. ఇటీవలకురిసిన భారీ వర్షాలకు సర్వీసు రోడ్డుపై వరదనీరు చేరింది. దీంతో రోడ్డు చెరువును తలపిస్తోంది. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు సర్వీస్ రోడ్డు అండర్ పాస్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు నిలిచింది. ఆ దారిగుండా వెళ్లే ప్రయాణికులు వాహనదారులు వర్షం పడిన ప్రతిసారి ఇబ్బందిగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

◆ **నిధులు కేటాయించండి**

నారాయణఖేడ్: కల్లుగీత కార్మికుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్ కోరారు. గురువారం డివిజన్ స్థాయి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా గీత కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. వృత్తి రక్షణ, యువతకు ఉపాధి, కార్మికులకు ద్విచక్రవాహనాలు అందజేయాలన్నారు. గీతన్న బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్ల పూర్తయిన సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.

◆ **ఏనుగు విగ్రహం ధ్వంసం**

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని కంబాలపల్లి కమాన్ వద్ద ఉన్న ఏనుగు విగ్రహం తొండాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఘటనపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ **సామూహిక కుంకుమార్చన**

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని హట్కర్ పేట భవాని మందిరంలో భవసార్ క్షత్రియ సమా జ్ ఆధ్వర్యంలో గురువారం అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమార్చన, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, చింత సాయినాథ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మల్గొండ



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్గొండ

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గ కురుమసంఘం తాలూకా ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు మల్గొండ గురువారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిశారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి, ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సమష్టిగా పని చేసి మెజార్టీ స్థానాల్లో విజయం సాధించేలా కృషి చేయాలని కేటీఆర్ సూచించినట్లు తెలిపారు.